వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 01 ఫిబ్రవరి 2024

## నాలుగు గడ్డివాములు దగ్గం రూ.2.5లక్షలు పైన ఆస్తి నష్టం



రాజుపాళెం,జనవరి31,ప్రభాతవార్త

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామం లో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నాలుగు గడ్డి వాములు దగ్గం అయ్యాయి వీటి విలువ దాదాపు రూ.2.5 లక్షలపైన ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. పశువులమేతగా ఎండు వరిగడ్డి, జోన్నసొప్ప. ఇతరపంటల మేతను సమకూర్చుకొని ఇటీవలే వేసుకొన్న రైతుల వాములు కాలిబూడిద అయ్యాయి దీంతో రైతులకు నష్టం కలగటంతో పాటు మూగజీవాలకు మేతకరువైనదని రైతులు ఆందోళన చెందు తున్నారు. వెంటనే ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది ఫైర్ఇంజన్ సహాయంతో సంఘటాన స్థలంనకు చేరుకొని మంటలను ఆర్పుతున్నారు. చుట్టుప్రక్కల ఉన్న ఇతర గడ్డివాములకు మంటలు వ్యాపించ కుండా నష్టం కల్గకుండా తగు చర్యలు తీసుకున్నారు. వీరికి తోడుగా గ్రామ ప్రజలు సహకరించి మంటలు ఆర్పుటకు సహకారం అందించారు. ఏదేమైనా పశువుల మేత అగ్నికి ఆహుతైనది.

## నూతన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :



అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. అభిషిక్త్ కిషోర్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిశారు. సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రజలకు అందించే విషయంలో తాము పూర్తిగా సహకారం అందిస్తామని, రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా అభివృద్ధిని సమిష్టి కృషితో సాధిద్దామని, నూతన కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు ఇరువురు కలిసి చర్చించారు.

# అన్నమయ్య జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

### - రాబోయే ఎన్నికలు సజావుగా జరిపిస్తా - ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరిస్తా

### - నూతన కలెక్టర్ అభిషిక్ కిషోర్



రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :

అన్నమయ్య జిల్లా అభివృద్ధికి కష్టపడి పని చేస్తా రాబోయే ఎన్నికలు సజావుగా జరిపిస్తా స్పందన అర్జీదారుల సమస్యలు ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించే దిశగా పని చేస్తానని అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ అభిషిక్ కిషోర్ చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. బాధ్యతగా పనిచేస్తానని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రజల్లోకి తీసుకెళ్తానని, అర్హులకు సంక్షేమ పథకాలు అదే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నం చేసి ఆ సమస్యలు పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేస్తుందని ఆయన తెలిపారు. సొంత రాష్ట్రం అయినా ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో తన చాంబర్ నందు సమీక్షించి తగు సూచనలు చేశారు.

**బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్**

అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం అభిషిక్ కిషోర్, బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించే ముందు రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులతో వేదమంత్రాలతో ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది జిల్లా అధికారులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంతోకాలంగా రైల్వేకోడూరు ప్రజల తీరిన కోరిక

### పాటూరుకు దక్కిన కాంట్రాక్టు పనులు




రైల్వేకోడూరు రూరల్, జనవరి 31 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని గుంజనేరు పరివాహక ప్రాంతంలో నీటికోతకు ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రజలు కోరిక ఎట్టకేలకు బుధవారంతో తీరిపోయింది. దాదాపు 40 కోట్ల రూపాయలతో శ్రీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ అధినేత పాటూరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఈ కాంట్రాక్టు పనులు ప్రారంభమయ్యాయి. దీనిపై ఎన్నో సంవత్సరాలుగా ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఎట్టకేలకు ప్రజలకిచ్చిన హామీని విజయవంతంగా పూర్తి చేసేందు అహర్నిశలు కష్టపడ్డారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతాలుగా వరదలు వస్తే పడరాని కష్టాలు పడుతుండేవారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలకు ఇచ్చిన కోరిక ఎటకేలకు నాటితో పనులు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరులోని గుంజనేరు కోతకు గురవుతున్న సందర్భంలో ఎట్టకేలకు 40 కోట్ల రూపాయలతో కాంట్రాక్టు పనులు ప్రారంభం కానున్నాయని ఆయన అన్నారు. ప్రజలు పడుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎట్టకేలకు పనులు విజయవంతంగా ప్రారంభమవుతున్నాయని, కోడూరు చరిత్రకు ఈ రక్షణ గోడ నిలిచిపోతుందని, శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ అధినేత పాటూరు శ్రీనివాసులరెడ్డికి కాంట్రాక్టు దొరకడం, సొంత నియోజక వర్గమైన రైల్వేకోడూరు వాసి శ్రీనివాసులురెడ్డి కావడం, ఆయన ఎన్నో కోట్లాది రూపాయల కాంట్రాక్టు పనులు చేసి ఎట్టకేలకు రైల్వేకోడూరు గుంజనేరు రక్షణ గోడకు కాంట్రాక్టు పనులు చేపట్టడం, నాణ్యతలో రాజీలేకుండా ఆయన ఈ పనులు విజయవంతంగా చేపడతారని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్య క్రమానికి రైల్వేకోడూరు అతిరథ మహారథులు, అన్నమయ్యజిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, పుల్లంపేట వైసిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివ సాయి, ఇరిగేషన్‌శాఖ కృష్ణమూర్తి, డిఇ చెంగల్‌రాయుడు, జడ్‌పిటిసి పాలెం కోట రత్నమ్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజుతో పాటు వైసిపికి చెందిన ప్రచార కార్య దర్శి సిడి నాగేంద్ర, గునిశెట్టి రమేష్, మేడా వెంకటసుబ్బయ్య, ముజీబ్, కోడూరు మస్తాన్, సలీంతో పాటు నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# గుంజన నదికి రూ. 40 కోట్లతో రక్షణ గోడకు భూమి పూజ





రైల్వేకోడూరు అర్బన్,జనవరి 31,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు పట్టణంలోని వెంకయ్య స్వామి గుడి సమీపంలో గల గుంజన నదికి 40 కోట్లతో రక్షణ గోడ ఏర్పాటుకు భూమి పూజ,బుధవారం ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేసి,పనులు ప్రారంభించారు. క్లాస్ వన్ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నో దశాబ్దాలుగా భారీ వరదల సమయంలో శాంతినగర్, వెంకయ్య స్వామి గుడి ప్రాంతం లోతట్టు ప్రాంతాలలో కోతకు గురై ఇల్లు కొట్టుకు పోవడం జరుగుతుంది. ఈ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం రక్షణ గోడ నిర్మాణానికి 40 కోట్లు నిధులు కేటాయించింది.ఈ పనులు పూర్తి అయితే భవిష్యత్తులో లోతట్టు ప్రాంతాల ప్రజలకు వరదల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే విప్ కొరముట్ల శ్రీనివాసులు శిలాఫలకం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ శాఖ ఎస్‌యు వెంకట్రామయ్య,ఈ ఈ కృష్ణమూర్తి,డి ఈ చంగల్ రాయుడు, ఏ ఈ రాజన్న, వైసీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి,వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివ సాయి,ప్రముఖ పారిశ్రామికవేత్త సిడి నాగేంద్ర, టూరిజం డైరెక్టర్ గుంటి మడుగు సుధాకర్ రాజు, వైసీపీ మహిళా నాయకురాలు వడ్డి అన్నపూర్ణ, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, మాజీ జెడ్పిటిసి మారెళ్ళ రాజేశ్వరి, చెవ్వు శ్రీనివాసుల రెడ్డి,విపిఆర్ కంద్రిక సొసైటీ బ్యాంకు ఛైర్మన్ సుద ర్శన్ రాజు,ఎంపీటీసీ నూకా మహేశ్వర్ రెడ్డి,ట్రేడ్ యూనియన్ నాయకులు కొప్పల శంకరయ్య, నందా బాల, ఎంపీటీసీ జనార్దన్ రాజు,ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మేడ వెంకటసుబ్బయ్య,మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్దులూరు సుబ్బరామరాజు, వైయస్ కరీముల్లా,సి హెచ్ రమేష్,మండల నాగేంద్ర, వైఎస్ఆర్సిపి సీనియర్ నాచకులు నాగరాజా, ఎంపీటీసీ బండారు మల్లికార్జున, అరుణ,శారద,చందు,ప్రతాపరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి పట్టణ అభివృద్దే ధ్యేయం

### - మునుపెన్నడూ లేని విధంగా సుందరీకరణ పనులు

### - రూ. 2 కోట్ల సుందరీకరణ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి





రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :

రాయచోటి పట్టణ అభివృద్దే తమ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో రూ. 2 కోట్ల నిధులతో చేపట్టిన సుందీకరణ పనులను మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాష, వైస్ ఛైర్మన్ దశరథ రామిరెడ్డి, ఫయాజుర్ రెహమాన్‌లతో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని వేంపల్లి క్రాస్ రోడ్డు, చిత్తూరు రహదారి మార్గంలోని రింగ్ రోడ్డు వద్ద సుందరీకరణ పనులకు భూమిపూజ నిర్వహించి సనులను శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2 కోట్ల నిధులతో మున్సిపల్ సహకారంతో టవర్ క్లాక్, 6 సర్కిల్స్‌లలో సుందరీకరణ పనులు ప్రారంభం కావడం హర్షనీయమన్నారు. ఎస్ఎన్ కాలనీ వద్ద రూ. 1.15 కోట్లతో టవర్ క్లాక్, అలాగే చిత్తూరు రహదారి మార్గంలోని సర్కిల్, నేతాజీ సర్కిల్, షాదీఖానా వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం వద్దనూ, మాసాపేట, వేంపల్లి సర్కిల్, డిబ్బలబడి సర్కిల్, ఎన్‌జిఓ కాలనీ సర్కిలలో సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆశిస్సులు, ఎంపీ మిధున్‌రెడ్డి సహకారంతో రాయచోటి జిల్లా కేంద్రంను చేసుకొని ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. రూ. 2.50 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

**మాసాపేట గుంత బజార్ ప్రజలతో మమేకమైన శ్రీకాంత్‌రెడ్డి**

మాసాపేట గుంతబజార్ ప్రజలతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మమేకమైయ్యారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. రూ. 15 లక్షల నిధులతో గుంత బజార్‌లో త్వరలో డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జిఎండి ఇమ్రాన్, జిఎండి ఇర్షాద్, కొలిమి చాన్‌బాష, ఫయాజ్, అహమ్మద్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, యువజన విభాగపు అధ్యక్షుడు ఇంతియాజ్, ముదిరాజ్ యువసేన సంఘ జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర, మున్సిపల్ ఏఇ కృష్ణారెడ్డి, పబ్లిక్ అండ్ హెల్త్ ఎఇ కావ్య, మున్సిపల్ ఆర్ఐ మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి-వైయస్ఆర్‌సిపి వర్గీయుల మధ్య ఘర్షణ

### భయభ్రాంతులకు గురైన పట్టణ ప్రజలు





ముద్దనూరు, జనవరి 31, ప్రభాతవార్త

వైసిపి-టిడిపి వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం బుధవారం పట్టణంలో నెలకొంది. ఇరువర్గాల వారు రాళ్లు, కుర్చీలతో దాడి చేసుకున్న ఘటనలో కారు అద్దాలు ధ్వసం అయ్యాయి.పట్టణ పరిధిలోని స్థానిక స్టేట్ బ్యాంక్ కార్యాలయ సమీపంలో నివాసముండే కుడుముల శశిధర్‌రెడ్డి ఇటీవల టిడిపి కమలాపురంలో నిర్వహించిన రా..కదలిరా సభలో శశిధర్ రెడ్డి టిడిపి కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సంధర్భంగా బుధవారం తన అనుచర కార్యకర్తలను నియోజికవర్గ టిడిపి ఇంచార్జ్ భూపేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమం ఉండటంతో స్థానిక వైసిపి నాయకులు ముని రాజారెడ్డికి, శశిధర్ రెడ్డి తమ్ముడు కావడంతో, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పక్కనే ఉన్న ముని రాజారెడ్డి నివాసంలో ఉండి, తన నివాసంలో ఉన్న శశిధర్ రెడ్డిని పిలుచుకురమ్మని చెప్పడంతో మునిరాజారెడ్డి, శ్రీధర్‌రెడ్డిని తీసుకు వెల్లారు. టిడిపి పార్టీలోకి చేరికలు ఉండటంతో టిడిపి ఇంచార్జ్ భూపేష్‌రెడ్డి అక్కడికి చేరుకున్న తర్వాత ఇరు వర్గాల మధ్య తీవ్ర మాటమాట పెరిగి ఇరు వర్గాల వారు రాళ్లు, కుర్చీలు విసురుకున్నారు. ఈ ఘర్షణలో మండల టిడిపి ఇంచార్జ్ శివరామిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. టిడిపి నాయకులతో కలిసి భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాధరెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటనను నివారించడంలో మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, విఆర్ డీఎస్పీ రమణ, కొండాపురం ట్రైని డీఎస్పీ శ్రీకాంత్, ముద్దనూరు సీఐ నరేష్‌బాబు, ఆర్ఐ ఆనంద్, స్థానిక పోలీసులు కీలకపాత్ర పోషించారు.

# అంతరాష్ట్ర అక్రమ మద్యం పట్టివేత

### గోవా నుండి తరలిస్తున్న 12.5 లక్షల బాటిళ్ళు స్వాధీనం

### ఐదుగురు అరెస్టు, ఐచర్ వాహనం స్వాధీనం

### విలేకరుల సమావేశంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌషల్



కడప క్రైం, జనవరి 31, ప్రభాతవార్త:

గోవా నుండి అక్రమంగా తరలి స్తున్న 12.52 లక్షల విలువ చేసే 1252 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని అంతర్‌రాష్ట్ర అక్రమ మద్యం సరఫర చేస్తున్న ముఠా రాకెట్‌ను గుట్టును రట్టు చేసినట్లు జిల్లా ఎస్పీ సిద్ధార్ధ్ కౌషల్ తెలిపారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఎస్పీ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రొద్దుటూరు పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు రహదారి మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడిన ఐచర్ వాహనంలో కూరగాయల రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. అరెస్టు అయిన వారిలో నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఈడిగ శ్రీధర్, రేకులకుంట వనిత్‌కుమార్‌రెడ్డి, బారికి శ్రీరాములు, ఈడిగ రవి, ప్రొద్దుటూరుకు చెందిన వెంపల్లి రవికుమార్‌రెడ్డి ఉన్నారన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రొద్దుటూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీం, స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్, ఎస్ఐ కిషోర్, రాజుపాళెం హెడ్‌కానిస్టేబుల్ నాగాంజినేయులు, ప్రొద్దు టూరు వన్‌టౌన్ పిసి బాబా ఫక్రుద్దీన్, ప్రొద్దుటూరు టూటౌన్ సిబ్బంది గంగాధర్, శివన్‌నారాయణను అభినందించి నగదు, రివార్డులను ఎస్పీ అందజేశారు.

**జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు:**

జిల్లా వ్యాప్తంగా సిఐ, ఎస్ఐలతో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా రవాణా చేస్తున్న నగదూ, మద్యం, ఇతరత్ర వస్తువులను సీజ్ చేస్తున్నట్లు ఎస్పీ తెలి పారు. జిల్లాలో 13 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి రా త్రి పూట గస్తీలు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. పదేపదే నేరాలకు పాల్పడే వారిపై జిల్లా బహిష్కరణ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు.

కౌన్సిల్ సమావేశానికి అనుమతించలేదని మీడియా నిరసన 2లో

పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసిపి ప్రభుత్వం 2లో

# వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాల మహిళలకు భరోసా

**పోరుమామిళ్ల, జనవరి31 (ప్రభాతవార్త ):**

వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాల అక్క, చెల్లెమ్మలకు భరోసా అని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల హైస్కూల్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు చంద్రబాబు పాలనకు, నేడు జగనన్న పాలకు మధ్య తేడాను గమనించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, బద్వేలు మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ రమణారెడ్డి, ఆప్కో డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, వైస్ ఎంపీపీ బాష, రాజశేఖర్, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయం కన్వీనర్లు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్‌బస్సు డ్రైవర్లకు అవగాహన

**బద్వేలు, జనవరి31 (ప్రభాతవార్త ):**



పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన వాహన డ్రైవర్లకు అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎంవీఐ శేఖర్‌రావు ఆధ్వర్యంలో డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శేఖర్‌రావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల విద్యాసంస్థలకు సంబంధించిన బస్సు డ్రైవర్లు పిల్లలను ఎక్కించుకుని వెళ్లేటపుడు అనుకోకుండా ప్రమాదం జరిగితే వారిని ఏవిధంగా రక్షించాలి అనేదానిపై అగ్నిమాపక సిబ్బంది డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. డ్రైవర్లు అప్రమత్తమై పిల్లలను రక్షించడమేకాకుండా, ప్రమాదాల నుంచి ఏవిధంగా తప్పించుకోవాలి, ప్రమాదం జరిగిన వెంటనే ఏవిధమైన నివారణ చర్యలు చేపట్టాలి అనే అంశంపై డ్రైవర్లకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ భద్రతా మాసోత్సవాలలో ఒక్కోరోజు ఒక్కో ప్రాంతంలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలు తూ.చ. తప్పక పాటించడం వలన క్షేమంగా గమ్యం చేరవచ్చన్నారు.

# మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు

**ఉద్యాన అధికారి జయ భరత్ రెడ్డి**

**సిద్ధవటం,జనవరి 31,ప్రభాతవార్త:**



మండల పరిధి లోని జ్యోతి పొన్నవోలు, వంతాటి పల్లి, యస్.రాజంపేట గ్రామాల పరిధిలోని మామిడి తోటలను బుధవారం రైతులతో కలిసి బద్వేల్ ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి పరిశీలించడం జరిగినది. ఈ సంవత్సరం ఆయన మాట్లాడుతూ రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన మామిడి రైతులు నిపుణుల సలహాల మేకు పూతకు రాని తోటలలో మల్టీ-కే 10 గ్రాములు 1.5 గ్రాములు బోరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత మొగ్గ దశలో ఉన్నప్పుడు తేనె మంచు పురుగు మరియు వివిధ రకాల పురుగులు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లి మరియు తెగులు నివారణకు మాంకోజెబ్ 2 గ్రాములు లేదా కార్బెన్డజిమ్ 1 గ్రా,వేప నూనె 2-3 మి.లి,ఆర్కా మాంగో స్పెషల్ 5 గ్రా,జిగురు 0.3 మి.లి లీటరు నీటికి కలిపి పిచికారీ చాయాలన్నారు. రెండవ పిచికారీ లో బుప్రొపుజెన్ 2 మి.లి బుప్రొపుజెన్,అసిఫాట్ 1గ్రా హెక్సకోనజోల్ 2 మి.లి లేదా మాంకోజెబ్ మరియు కార్బెన్డజిమ్ 1.5 గ్రా,బోరాన్ 1 గ్రా తో పాటు జిగురు 0.3 మి.లి కలిపి పిచికారీ చేయాలన్నారు.మొదటి పిచికారీ లో జింక్ లేదా బోరాన్ కలపకపోతే రెండవ పిచికారీ లో కలిపి పిచికారీ చేస్తే పూత మరియు పిందె బాగా నిలబడుతుందన్నారు. తేనె మంచు పురుగును సమర్ధవంతంగా నివారించటం కోసం ఒక్కో మామిడి చెట్టుకు పసుపు రంగు జుగురు అట్లను వేలాడతీయాలన్నారు.మామిడి రైతులు సలహాలు సూచనల కొరకు సంబంధిత రైతు భరోసా కేంద్రం ను సంప్రదించవలసినదిగా ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి తెలియచేయటం జరిగినది.

# ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే సీఎం జగన్ లక్ష్యం

**– నాల్గో విడత వైఎస్ఆర్ చెక్కులు పంపిణీ**



**పులివెందుల, జనవరి 31, ప్రభాతవార్త ః**

అక్క, చెల్లెమ్మల ఆనందమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ వరప్రసాద్‌లు అన్నారు. పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులోని శ్రీకర్ కల్యాణ మండపంలో బుధవారం పొదుపు సంఘాల మహిళలతో మెప్మా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మహిళ లక్షాధికారి కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. పులివెందుల ఉమన్సిపాలిటీలోని 968 సంఘాల్లోని 9642మంది సభ్యులకు రూ.38కోట్లు మంజూరు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఇచ్చిన మాటలు నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా లబ్ధి పొందిన మహిళలు తమ పిల్లల భవిష్యత్తు కోసం వారి చదువుల కోసం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో కూడా మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఐదు లక్షల ఓట్ల మెజార్టీ తెచ్చే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశం కూడా అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. – 2000మందికి ఉపాధి ః పులివెందుల ప్రాంతంలో నిరుద్యోగులందరికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పులివెందుల పురపాలిక పరిధిలోని జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో సుమారు 2000మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఆదిత్యబిర్లా పరిశ్రమను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. ఎవరైనా మహిళలు ఉపాధి అవకాశాల కోసం ఆదిత్యబిర్లా వారిని సంప్రదించాలన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో ఆదిత్యబిర్లా కంపెనీ ఏర్పాటు చేస్తున్నారన్నారు.

**– సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోకు పాలాభిషేకం ః**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత రుణాలు పంపిణీ చేయడంతో పులివెందుల రోటరీపురం కౌన్సిలరు సలీమా, ఆర్పీలు రమణమ్మలు, పొదుపు సంఘాల మహిళలతో కలిసి సీఎం జగనన్న చిత్రపాటనికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి పంపిణీ చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమీషనరు రమణారెడ్డి, వైస్‌ఛైర్మన్ హాఫీజ్, జేఏసీ కన్వీనర్లు కిషోర్, చంద్రమౌళి, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, సీఎంఎం రాజేశ్వరి, మెప్మా పీవో నాయుడు, నాగేంద్ర, గృహ నిర్మాణశాఖ డైరెక్టరు శైలజ, కౌన్సిలర్లు కోడిరమణ, భార్గవి, పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు సాదిస్తే ఉద్యోగాలు

**ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి**

**కురబలకోట, జనవరి 31 ప్రభాతవార్త :**



విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాల్లో పట్టు సాధిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం అంగళ్ళు సమీపంలోని విశ్వం డిగ్రీకళాశాలలో ఏపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో వివిధ కంపెనీలచే క్యాంపస్ ఇంటర్వ్యూలను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో 423మంది విద్యార్థులు పాల్గొనా 198మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల ఛైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, బిసి కార్పోరేషన్ డైరెక్టర్ సురేంద్ర, డిఎస్‌జిఓ హరిక్రిష్ణ, డిపిఓ వెంకటేష్, కోఆర్డినేటర్ రేవతిలు అభినందించారు.

# వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వైద్యపరిమితిని రూ.25లక్షలకు పెంపు

**– ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పోరేట్ వైద్యం**

**– వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్**

**మదనపల్లె, జనవరి 31 ప్రభాతవార్త :**



పేద కుటుంబాలకు పునర్జన్మ ప్రసాదిస్తున్న అపర సంజీవని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ అని నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 14వ వార్డులో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం నూతనంగా ముద్రించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ జరిగింది. కౌన్సిలర్ షబానా, వక్స్‌బోర్డు జిల్లా అధ్యక్షులు ఎస్ఏ.కరీముల్లా ఆధ్వర్యంలో సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్ జింకా చలపతిలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ పేదవాడు వైద్యకోసం మహానేత వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే ఆయన కుమారిడిగా సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా తీర్చిదిద్దారన్నారు. క్యాన్సర్‌లాంటి మహమ్మారి బారినపడిన బాదితులకు పరిమితిలేని చికిత్సలు అందిస్తూ ఆరోగ్యశ్రీ సంజీవనిగా మారిందన్నారు. వారిక ఆదాయం రూ.5లక్షలు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంతోరాష్ట్రంలో 90శాతం కుటుంబాలు లబ్దిపొందుతున్నాయన్నారు. ప్రజలందనరూ ఆరోగ్యంగా ఉండటమే వైఎస్ఆర్ సిపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకువచ్చి ఇంటివద్దకే ఉచితంగా వైద్యసేవలు, మందులు అందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సిపిని ఆదరించి జగనన్న ప్యాన్ గుర్తుపై ఓటువేసి ప్రజా ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంనగా 14వ వార్డులో సుమారు 200మందికి ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముబీనా, సుగుణ, రామిశెట్టి శివయ్య, నాయకులు ఆంజినేయులు, సాయిశేఖర్‌రెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


# వైసిపి నుండి టిడిపిలో చేరికలు

**మైదుకూరు జనవరి 31,ప్రభాత వార్త :**



మైదుకూరు పట్టణ పరిదిలోని 9వ వార్డుకు చెందిన వైకాపా నాయకులు,వారి అనుచరవర్గం బుధవారం టిడిపి బాద్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చెరారు. 9వ వార్డుకు చెందిన మాబు ఉసేన్,ఉసేన్ వల్లి, మహమ్మద్ ఉసేన్,బషీర్ బాషా,రఫీ,మస్తాన్,ఆషీఫ్ వారి అనుచరవర్గం దాదాపు 40 కుటుంబాలవారు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ నాపై, తెలుగుదేశంపార్టీపై నమ్మకంతో ఈరోజు వైసిపి పార్టీ వదిలి తెలుగుదేశం పార్టీలోకి రావడం జరుగుతుందన్నారు. నన్ను నమ్మి పార్టీలోకి వచ్చిన వారికి అన్ని విధాల ఆదుకోని,వారికి సముచిత స్థానం కల్పిస్థానని వచ్చె ఏన్నికల్లో అందరు కలిసి కష్టపడి పనిచేసి నాగెలుపుకు కృషి చేయాలని కోరారు.వెంటనే మునిషిపల్ కమీషనర్‌తో పోనులో మాట్లాడి 9వ వార్డులో నీటి సమస్య లేకుండా చూడవలసినదిగా కోరారు.మీరు చేయలేని పక్షంలో నాసోంత డబ్బులతో బోరువేసినీటి సమస్య తీరుస్తానని మాట ఇచ్చారు. మాబు ఉషేన్ మాట్లాడుతూ మా 9వ వార్డులో మంచినీటి సమస్య విపరీతంగా ఉందని, డ్రైనేజీ బాగులేక ఏన్నో విబ్బందులు పడుతున్నామని అలాగె సిసిరోడ్డు వేయమని ఏన్నోసార్లు ఎమ్మెల్యే దృష్టికి,కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని కోరారు.మావార్డు అభివృద్ధి చెందాలంటె సుదాకర్ యాదవ్ తోనే సాద్యామౌతుందని నమ్మి ఈ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని తువ్వపల్లె, కట్టక్రిందపల్లె, జాండ్లవరం గ్రామాలకు చెందిన మరో 40కుటుంబాలు టిడిపి ఇన్చార్జి సుధాకర్ యాదవ్ నివాసంలో పార్టీ కండువ కప్పుకున్నారు.పార్టీ మారిన వారిలో మాకిరెడ్డి సుబ్బారెడ్డి,మాజీ సర్పంచు వెంకటయ్య, కోటా బాలనారాయణ రెడ్డి, యనమల చంద్రశేఖర్‌రెడ్డి, నక్కా సబ్బరామిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరి బాబు,జనసేన ఇన్చార్జి పందిటి మల్హోత్ర,దనపాల జగన్, బియన్.శ్రీనివాసులు(మాజీ ప్రసిడెంటు) బియన్.శ్రీనివాసులు (మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్)కటారి కృష్ణ,బీబిసుధా, ఏపి రవీంద్రా, కుర్రా రాధా,సుబ్బారెడ్డి,మండల అద్యక్షులు భీమయ్య,అన్నవరం సుధాకర్ రెడ్డి,శీర్ల నాగమోహన్, తెలుగు దేశం పార్టీ నాయకులు ఉన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు



**రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :**

అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంల పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఘనంగా సన్మానించారు. ఎస్ఐ ఎంఎస్ జైనుల్లా అబెద్దీన్, ఏఎస్ఐ వి. రమేష్‌బాబులు పదవీ విరమణ చేయడం జరిగింది. ఎంఎస్ జైనుల్లా అబెద్దీన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు 1989 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయిన అనంతరం అనంతపురం జిల్లాలో అనేక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం 2023వ సంవత్సరం నవంబర్ నుండి అన్నమయ్య జిల్లాలో సేవలందించారు. 34 సంవత్సరాలుగా పోలీసు డిపార్ట్‌మెంట్‌లో విశిష్ట సేవలు అందించారు. అఖరిగా అన్నమయ్య జిల్లా డిసిఆర్‌బి నందు విధులు నిర్వహిస్తూ నేడు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 34 సంవత్సరాలపైన సంతోషకరంగా సుదీర్ఘకాలం పోలీసు శాఖకు ఉన్నతమైన సేవలను అందించి ఆదర్శవంతులుగా నిలిచారన్నారు. తన జీవితంలో ఎన్నో రకాలైన అంశాలను ఎదుర్కొని నిలబడి ఒక వైపు పోలీసు ఉద్యోగాన్ని, మరోవైపు వ్యక్తిగత జీవితం అన్నింటిని సమపాలన చేస్తూ కలిసిమెలిసి ముందుకు సాగిపోవడం, తనకుచ్చిన విధులను విజయవంతం చేయడం, అధ్యాయంలోకి అడుగుపెడుతున్న మీకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఎస్పి సిఐ టివి సత్యనారాయణ, దిశ సిఐ చంద్రశేఖర్, డిసిఆర్‌బి సిఐ వరప్రసాద్, ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు అధికారులు, పదవీ విరమమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

# పరీక్ష ఫలితాలలో శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



**రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :**

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థినీ విద్యార్థులు యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఎం సబీహా 87.37శాతంతో మొదటి ర్యాంకు, ఎం. వెంకట పవిత్ర 85 శాతంతో రెండవ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి సయ్యద్ సనా షాజియా 91.1శాతం మొదటి ర్యాంకు పఠాన్ ముస్కాన్ 88.6 శాతం రెండవ ర్యాంకు కతీబ్ జుమేరియా తస్లీమ్ 87.2శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్శిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను, ఫలితాల సాధనలో విభాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికి ఉద్యోగ, ఉపాధి భరోసా కల్పించడానికి మౌళిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి కె. చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

# సిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు పూర్తి సమాచారంతో హాజరు కావాలి

**– జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

**రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :**



ఫిబ్రవరి 1వ తేదీ గురువారం జరిగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధిత అధికారులు అందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు గురువారం జరిగే సిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించి అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధిత అధికారులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఇందులో రీ సర్వే ఇనామ్ అసైన్‌మెంట్ ల్యాండ్స్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఎన్ఆర్ఈజిఎస్, తాగునీటి, సమస్య తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ జరరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభమవుతుందని, వీసికి ఆయా శాఖల అధికారులు స్పష్టంగా నోట్స్ తయారు చేసుకొని హాజరు కావాలన్నారు.

# మద్యం బార్‌లను తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు

**బద్వేలు, జనవరి31 (ప్రభాతవార్త ):**



పట్టణంలోని మద్యం బార్‌లపై ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఎక్సైజ్ సీఐ సుహాసిణి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని స్వప్న బార్ అండ్ రెస్టారెంట్, గౌరిసాయి బార్ అండ్ రెస్టారెంట్‌లను తనిఖీ చేసి మద్యం అమ్మకాలపై ఆరా తీశారు. బాటిళ్లలోని మద్యం ఆల్కాహాల్ శాతం పరిశీలించారు. అలాగే బార్‌లోని పరిసరాలను పరిశీలించారు.అంతేగాక కేటాయించిన ధరలకే అమ్ముతున్నారా లేక అధిక ధరలకు విక్రయిస్తున్నారా అనేది తెలుసుకున్నారు. సమయ పాలన పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తదితర సూచనలు చేశారు.

# వైసిపి నేత జ్యోతీశ్వర్‌బాబు హఠాన్మరణం

**మంచి మిత్రుని కోల్పోయా ః ఎమ్మెల్యే మేడా**

**రాజంపేట అర్బన్, జనవరి 31 ప్రభాతవార్త**





రాజంపేట పట్టణానికి చెందిన బిసి నేత, వైఎస్ఆర్‌సిపార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపిటిసి నల్లబోతుల జ్యోతీశ్వర్‌బాబు(60) బుధవారం సాయంత్రం హఠాన్మరణం చెందారు. రెండు రోజుల క్రితం అస్వస్థతగా ఉండడంతో హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రులకు చికిత్స కోసం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో కుప్పకూలారు. సాయంత్రం 5 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఈ సమయంలో ఆయన ఇద్దరు కుమారులు ఉన్నారు. హైదరాబాదులోనే ఉన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వెంటనే ఆసుపత్రికి చేరుకుని విషాదంలో మునిగారు. ప్రాణ స్నేహితుడు, చిరకాల మిత్రుడు కావడంతో కంటతడిపెట్టారు. ఒక మంచి మిత్రున్ని కోల్పోయానని మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. జ్యోతీశ్వర్‌బాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జ్యోతీశ్వరబాబు అకాల మరణం పట్ల బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచూరి రాధాకృష్ణ, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ పిసి యోగీశ్వర్‌రెడ్డి, నందలూరు మాజీ ఎంపిపి కడవకూటి సాయిబాబా, మున్సిపల్ కౌన్సిలర్‌లు కూండ్ల వెంకటరమణారెడ్డి, రాముయాదవ్, తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, మరో సీనియర్ నేత గుణకల సుబ్బరాయుడు, అన్నమయ్య జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు చుండు సుధీర్‌నాయుడులు సంతాపం వ్యక్తం చేశారు.

# ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరపాలి

**– ఎటువంటి తప్పు చేసినా చర్యలు తప్పవు**

**– నోడల్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్**



**రాయచోటి, జనవరి 31, ప్రభాత వార్త :**

ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని ఎటువంటి తప్పు చేసినా, చేయాల్సిన పని చేయకపోయినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక రాయచోటి కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సాధారణ ఎన్నికలు 2024పై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని తెలిపారు. ఈనెల 22న ప్రకటించిన తుది ఎన్నికల జాబితాపై సమీక్షిస్తూ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్‌లో లాటిన్‌లు అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. నోడల్ అధికారులు వారు నిర్వర్తించాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ జరగాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా జాయింగ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్‌డిఓలు, ఈఆర్ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# క్యాస్ట్ సర్వేని తనిఖీ చేసిన డీపీఓ

**చిన్నమండెం, జనవరి 31(ప్రభాతవార్త):**



మండలంలోని కేశాపురం గ్రామం దేవలంపేటలో జరుగుతున్న క్యాస్ట్ సర్వేని బుధవారం జిల్లా పంచాయతీ ఆఫీసర్ ధనలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సర్వేని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే గ్రామాలలో పారిశుధ్య చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు.కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పుట్టగొడుగుల దినోత్సవం

**పాల్గొన్న కళాశాల అధ్యాపక బృందం**

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 31 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఆవరణంలో పుట్టగొడుగుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ ఎస్‌సి సబ్‌ప్లాన్ ద్వారా పుట్టగొడుగుల పెంపక నిర్వహణను అందరికి అవగాహన కల్పిస్తున్నామని కళాశాల శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పూర్తిస్థాయిలో పుట్టగొడుగుల ద్వారా అభివృద్ధి, ఆదాయం అనేవాటిపై కూలంకశంగా రైతులకు సూచిస్తున్నారని అన్నారు. డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ కెఎస్ పద్మావతమ్మ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ లాభదాయకమైన పుట్టగొడుగుల పరిశ్రమను తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి పొందవచ్చునని ఆమె సూచించారు. దీనిద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని కూడా రైతులు సంపాదించుకోవచ్చునని తెలిపారు. అదేవిధంగా కళాశాలకు చెందిన డాక్టర్ కెకె రమణ, డాక్టర్ సిహెచ్ రూత్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మీలు మాట్లాడుతూ ప్రతినెలా పుట్టగొడుగుల పెంపకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో అనుభవంతో రైతులకు అవగాహనను కల్పిస్తున్నారని, ముఖ్యంగా వారు చేసిన ప్రయత్నాలు అనుభవాలను వారు సూచించారు. మష్రూమ్స్ మార్వ్యల్స్ విద్యార్థులు వెంకటరెడ్డిపల్లె గ్రామ లబ్దిదారులు వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, శివకుమార్, సుబ్బరాయుడు, రవి, భాస్కర్, తిరుగుడుపల్లె గ్రామానికి చెందిన శంకర్, వెంకటలక్షుమ్మ, అదేవిధంగా కళాశాల ఆచార్యులు డాక్టర్ సదరున్నీషా, డాక్టర్ లలిత, శిరీషా, డాక్టర్ దినేష్, డాక్టర్ పద్మజ, డాక్టర్ శారదా, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ప్రసాద్, సురేంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోడూరులో అడుగడుగునా అపరిశుభ్రత

**స్పందించని అధికారులు-దుర్వాసన పీల్చలేని ప్రజలు**

**రైల్వేకోడూరు,అర్బన్,జనవరి 31,ప్రభాతవార్త:**




కోడూరు గ్రామపంచాయతీ అధిక నిధులకు మండలంలోని పెద్ద పుట్టినిల్లు.అయితే పంచాయతీకి వచ్చే నిధులను నిలువునా మింగే ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు ఉన్నారు గాని,పారిశుద్ధ్యం పట్ల పట్టించుకున్న దాఖలాలేలేవన్నట్లు తెలుస్తుంది. కోడూరు పట్టణంలో అడుగు తీసి అడుగు వేస్తే గాని ఎక్కడపడితే అక్కడ అపరిశుభ్రత దర్శనమిస్తుంది. దీనిపట్ల స్పందించాల్సిన అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యంగా ఉన్నారు.దీంతో పట్టణ ప్రాంతంలో పేరుకపోయిన చెత్తకుప్పలు,మూతలు లేని మురుగు కాలువల నుంచి వెదజల్లే దుర్వాసనతో పట్టణ ప్రజలు తీవ్ర వ్యాధులకు గురై. బెంబేలెత్తే పరిస్థితి వస్తున్నట్లు తెలుస్తుంది.కోట్లాది రూపాయలు,పంచాయతీకి నిధులు,ఆదాయాలు ఉన్నప్పటికీ పట్టణంలో పారిశుద్ధ్యం ఈ పంచాయతీకి పెట్టని ఆస్తిగా మిగిలినట్లు కనిపిస్తుంది.అధికారులు,ప్రజా ప్రతినిధులు చేసే ఆర్భాటాలకు లోనై నిధులను నిలువునా దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఏమాత్రం సందేహం లేదు. పారిశుద్ధ్యం పట్ల ప్రజలు ప్రశ్నిస్తే,అధికారులు పైన,చెప్పుకుంటూ పట్టణ ప్రాంతాన్ని అంతా మురికి కుపాలుగా ఉండేటట్లు చేశారు.స్థానిక సర్పంచికి నిధులు ఆదాయాల గురించి తెలియదు.అలాగని అధికారులు కూడా వాటిని ఆయనకు వివరించుకునే నిధులను దుర్వినియోగం చేసి,పంచాయతీలో అభివృద్ధిని శూన్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై సంబంధిత పంచాయతీ శాఖ అధికారులను వివరన కోరగా నోరు మెదపడం లేదు.

# మితిమీరిన వేగానికి నిండు ప్రాణం బలి

**ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి మృత్యువాత**

**రాజంపేట, జనవరి 31, ప్రభాతవార్త:**



మితిమీరిన వేగానికి ఒక నిండు ప్రాణం బలైంది.వివరాల్లోకి వెళితే పట్టణ కేంద్రంలోని బుధవారం ఉదయం తిరుపతి కడప ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణా నాయక్ అలియాస్ చిన్న (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతపురం జిల్లా గుత్తి బాట తండా గ్రామానికి చెందిన కృష్ణా నాయక్ అలియాస్ చిన్న తండ్రి భీమా నాయక్ బ్రతుకుతెరువు కోసం కూలి పనులు చేసుకునేందుకు రాజంపేటకు వలస వచ్చి ప్రతిరోజు కూలి పనులకు వెళ్తూ రాజంపేటలో నివాసం ఉంటున్నాడు. కృష్ణా నాయక్ (చిన్నా) తన మోటార్ సైకిల్ పై అమ్మవారిశాల వైపు నుంచి పాత బస్టాండ్ వైపుకు వెళుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి క్రింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.విషయం తెలుసుకున్న బంధువులు ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలిపిస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో రాజంపేట పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది.పట్టణ సిఐ మద్దెయ్య ఆచారి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని తన సిబ్బందితో దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రమాద ఘటనకు సంబంధించి సిసి ఫోటోలను వీడియోలను బయటకు తీసి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు.సమీపంలో ఉన్నటువంటి స్థానికులు కూడా మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని నడపడం వల్ల అదుపుతప్పి మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. అయినప్పటికీ మృతుని బంధువులు రాజంపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాసేపు గుమికూడి బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.శివాలయం వద్ద ప్రధాన రహదారిలో జరిగిన ఈ ఘటన నేటి యువతకు ఓ హెచ్చరిక వంటిది.ప్రాణం కన్నా విలువైనది ఏదీ లేదు. నిదానమే ప్రధానం...పది నిమిషాలు ఆలస్యం ఐతే అనుకున్న పని కుదరకపోవచ్చేమో కానీ...అతి వేగం నిండు ప్రాణాలు తీసి నమ్ముకున్న కుటుంబాలను రోడ్డుకీడుస్తుందని చెప్పడంలో సందేహం లేదు.